ప్రజాశక్తి
బుధవారం 14 మే 2025



ఉత్సాహంగా కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా మండల కేంద్రంలోని జిల్లా శాఖ గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులు, చిన్నారులకు కబడ్డీ ఆటల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో సుమారు 20 మంది విద్యార్థులు చిన్నారులు పాల్గొన్నారు. ఇందులో గెలుపొందిన విద్యార్థులకు శిబిరాలు చివరి రోజున బహుమతులను అందజేయనున్నట్లు గ్రంథాలయ అధికారిని ఎస్ సునీత తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సుబ్బారావు, తదతరులు పాల్గొన్నారు.



ఆడుతున్న విద్యార్థులు

వైభవంగా ముగిసిన మోదకొండమ్మ ఉత్సవాలు

భారీగా తరలివచ్చిన జనం ▸▸ ఘనంగా ఘటాల ఊరేగింపు ▸▸ ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శలు



భారీగా తరలి వచ్చిన జనం

ప్రజాశక్తి-పాడేరు,పాడేరు టౌన్: జిల్లా కేంద్రం పాడేరు పట్టణంలో మూడు రోజులు పాటు జరిగిన మోదకొండమ్మ ఉత్సవాలు జన ప్రభంజనంగా సాగాయి. మూడవ రోజు మంగళవారం మోదకొండమ్మ ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. వేలాదిమంది భక్తులు అమ్మవారి ఉత్సవాలలో పాల్గొన్నారు. అర్ధరాత్రి దాటే వరకు కూడా సందర్శకులతో పాడేరు పట్టణ రోడ్లన్నీ కిక్కిరిసి పోయాయి. సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి ఆదివాసి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. రాత్రంతా పాడేరు పట్టణంలో జన జాతర సందడిగా సాగింది. దూర ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకోవడానికి తమ తమ బంధువుల ఇళ్లకు చేరి మంగళవారం అణుపు ఉత్సవం రోజున ఆలయానికి వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా వేకువ జాము నుంచి అమ్మవారి ఆలయం వద్ద శతకంపట్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు బారులు తీరి అమ్మవారిని



ఘటాలకు పూజలు చేస్తున్న భక్తులు

దర్శించుకున్నారు..

శతకంపట్టు వద్ద ఆదివారం అమ్మవారిని కొలువు తీర్చినప్పటి నుంచి తమ తమ ఇళ్లల్లో ఘటాలను ప్రతిష్టించుకొని మూడు రోజులు నుంచి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పసుపు కుంకుమలతో పూజలు చేసి వాటిని కుటుంబ సమేతంగా భక్తులు ఊరేగింపుగా ఘటాలను తెచ్చి అమ్మవారికి సమర్పించారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ఈ ఘటాల ఊరేగింపు కొనసాగింది. డప్పు వాయిద్యాలు, ధూప దీపాలతో ఈ ఘటాల ఊరేగింపు సంబరంగా సాగింది.రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలకు జనం



డప్పులు వాయిస్తున్న కళాకారులు



నేల వేషాలు వేస్తున్న కళాకారులు

విస్తృతంగా ప్రచారం చేయడంలో అధికారులు నిరంతరం కృషి చేయాలని, ఎప్పటికప్పుడు ప్రభుత్వ పథకాలపై ప్రజాభిప్రాయాలను సేకరించి ప్రభుత్వానికి నివేదించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ సహాయకులు పి.శ్రీనివాసరావు, జూనియర్ సహాయకులు కె. సంధ్యారాణి, రికార్డు సహాయకులు కె. మోహన్ రావు, టైపిస్ట్ ఇ. శ్రీనివాస రావు, ఫోటోగ్రాఫర్ గమ్ బహదూర్, సిబ్బంది పి.వరలక్ష్మి, బి.పుష్ప, తదితరులు పాల్గొన్నారు.

మోదమ్మను దర్శించుకున్న మంత్రి సంధ్యారాణి

పాడేరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ గిరిజన సంక్షేమ శాఖామంత్రి గుమ్మడి సంధ్యారాణి ఉత్సవాల సందర్భంగా మోదకొండమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరుపున అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ లాంఛనాలతో మంత్రికి ఆలయ కమిటి సభ్యులు స్వాగతం పలికారు. శతకం పట్టు వద్దకు వెళ్లి అమ్మవారి దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె విలేఖరులతో మాట్లాడుతూ, అర్హులందరికి పథకాలు అందించడానికి ముఖ్య మంత్రి కృషి చేస్తున్నారన్నారు. జి.ఓ 3 కు ప్రత్యామ్నాయంగా వేరొక జిఓ జారీ చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ముఖ్య మంత్రి త్వరలోనే అల్లూరి సీతారామ రాజు జిల్లా ను సందర్శిస్తారని పేర్కొన్నారు. వివిద ప్రభుత్వ శాఖల స్టాల్స్ ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి జిల్లా కలెక్టర్ ఎం. జె. అభిషేక్ గౌడ, ఎస్పీ అమిత్ బర్దార్, పోలవరం ప్రాజెక్టు పరిపాలనాధికారి వి. అభిషేక్, సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్, ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డి, మాజీ శాసన సభ్యురాలు గిడ్డి ఈశ్వరి, ఐటిడి ఏ సహాయ ప్రాజెక్టు అధికారి ఎం.వేంకటేశ్వరరావు, పరిపాలనాధికారి ఎం.హేమలత, పిడి సూర్యలక్ష్మి, ఉప సంచాలకులు ఝాన్సీరాణి పాల్గొన్నారు.



ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న మంత్రి సంధ్యారాణి

తగ్గిన మావోయిస్టుల ప్రభావం

- ఎఎస్‌పి నవజ్యోతి మిశ్రా



మాట్లాడుతున్న ఎఎస్‌పి నవజ్యోతిమిశ్రా

ప్రజాశక్తి-సీలేరు : అల్లూరి సీతారామరాజు జిల్లాలో మావోయిస్టు ప్రభావం పూర్తిగా తగ్గిపోయిందని చింతపల్లి సబ్ డివిజనల్ ఎఎస్‌పి నవజ్యోతి మిశ్రా వెల్లడించారు. మంగళవారం సీలేరు వచ్చిన ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ గత రెండునెలల్లో జికె వీధి చింతపల్లి మండల పరిధిలో మావోయిస్టులు భారీగా లొంగిపోయారన్నారు. మే7వ తేదీన వై.రామవరం మండలం శేసరాయి అటవీ ప్రాంతంలో జరిగిన ఎదురుకాల్పుల్లో మావోయిస్టు పెద్ద క్యాడర్‌కి చెందిన కాకూరు పండన్న అలియాస్ జగన్, వాగపోడియామీ అలియాస్ రమేష్ మృతి చెందడంతో మావోయిస్టుల ప్రభావం పూర్తిగా తగ్గిపోయిందని తెలిపారు. తప్పించుకున్న మావోయిస్టుల కోసం స్పెషల్ పార్టీ గ్రేహౌండ్స్ పోలీసు బలగాలతో నిరంతరం ఆపరేషన్ కొనసాగిస్తున్నట్లు చెప్పారు. జనజీవన స్రవంతిలో కలవాలనుకున్న వారికి పోలీస్‌శాఖ నుంచి జీవనోపాధి కల్పిస్తామన్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలు, మారుమూల గిరిజన గ్రామాలకు రహదారుల నిర్మాణం మౌలికవసతుల కల్పనకు జిల్లా పోలీస్‌శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. జిల్లాలో గంజాయి పూర్తి స్థాయిలో నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. గంజాయి సాగు చేస్తే డ్రోన్‌ల ద్వారా ధ్వంసం చేస్తున్నామని, అన్ని శాఖాధికారులతో ఈగిల్ టీమ్‌లు ఏర్పాటు చేసి గంజాయి సాగు చేయకుండా పకడ్బందీ చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఎవరైనా గంజాయి సాగు, అక్రమ రవాణాకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. జికె వీధి సిఐ వరప్రసాద్ ఎస్‌ఐ రవీంద్ర, జికెవీధి ఎస్‌ఐ అప్పలసూరి పాల్గొన్నారు.

అడ్డతీగల యూనియన్ బ్యాంక్ మేనేజర్‌గా ప్రసాద్

ప్రజాశక్తి- అడ్డతీగల: అడ్డతీగల యూనియన్‌బ్యాంక్ మేనేజర్‌గా ప్రసాద్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పిఠాపురం మండలం చేబ్రోలు నుండి ఉద్యోగోన్నతిపై అడ్డతీగల మేనేజర్‌గా వచ్చారు. ఇప్పటివరకూ ఇక్కడ బాధ్యతలు నిర్వహించిన ఎ.రవికిరణ్ రాజవొమ్మంగి మేనేజర్‌గా బదిలీపై వెళ్లారు. రవికిరణ్‌కు బ్యాంకు సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు.



ప్రసాద్

హత్యకేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి -సీలేరు : జికెవీధి మండలం సీలేరు పంచాయతీ జిడిసి క్యాంపులో ఆదివారం అర్ధరాత్రి ఇరువురిని హత్య చేసి మరొకరిని తీవ్రంగా గాయపరిచిన నిందితుడు వంతల గెన్నును మంగళవారం అరెస్ట్ చేసినట్లు జికె వీధి సిఐ వరప్రసాద్ వెల్లడించారు. నిందితుడిని బుధవారం జుడీషియల్ కోర్టులో హాజరు పరుస్తావన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిందితుడి కోసం సోమవారం గాలింపు చర్యలు చేపట్టగా, సీలేరు సమీపంలో ఉన్న ఫిల్టర్ ఆఫీస్ కొండపై ముద్దాయి ఉన్నట్లు ఖచ్చితమైన సమాచారం మేరకు మంగళవారం ఎస్‌ఐ రవీంద్ర సిబ్బంది విఆర్‌ఓలతో కలిపి నాలుగు బృందాలుగా విడిపోయి అక్కడికి వెళ్లినట్లు చెప్పారు. కొండ చివరన పొదల్లో దాగివున్న గెన్నును అదుపులోకి తీసుకుని హత్యకు ఉపయోగించిన ఆయుధాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మృతదేహాలకు చింతపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించామని తెలిపారు.



మాట్లాడుతున్న సిఐ వరప్రసాద్

ట్రాక్టర్ బోల్తా పడి బాలుడు మృతి

ప్రజాశక్తి-ఎటపాక : రాయన్నపేట వద్ద జాతీయ రహదారిపై ట్రాక్టర్ బోల్తా పడి కోడి చరణ్ (16) మృతి చెందాడు. సోమవారం అర్ధరాత్రి ట్రాక్టర్ యజమాని ఆదేశానుసారం ఇసుక అక్రమంగా తరలించేందుకు వెళ్లారు. వారితో పాటు చరణ్ కూడా వెళ్లాడు. ర్యాంపులు పరిశీలించేందుకు అధికారులు వస్తున్నారనే సమాచారం తెలుసుకుని డ్రైవర్ ట్రాక్టర్‌ను వేగంగా నడపడంతో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో చరణ్ అక్కడికక్కడే మృతి చెందాడు.

పశువుల నీటి తొట్టెలు ఏర్పాటు చేయరూ..!


ప్రజాశక్తి-చింతూరు: డివిజన్‌లోని చింతూరు మండల పరిధిలో మండుతున్న ఎండలకు పశుగ్రాసం కరువై పశువులు రోడ్లపై తిరుగుతున్నాయి. పశువులకు నీటి తొట్టెల పథకం గత ప్రభుత్వంలో చేపట్టినా ఎక్కడా వాటి జాడ కనిపించడం లేదు. టిడిపి ప్రభుత్వం కూడా ఈ పథకాన్ని అమలు చేయాలని సంకల్పించింది కానీ సంపూర్ణంగా ఎక్కడా నిర్మించలేదు. పశువులు రోడ్లపై తిరగడం వల్ల ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. పశువులకు తాగునీటి తొట్టెలు వెంటనే ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కోడిపిల్లల పెంపకంతో ఆర్థికాభివృద్ధి

ప్రజాశక్తి-రంపచోడవరం : కోడిపిల్లల పెంపకం చేయడం ద్వారా గిరిజనులు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ నరసింహులు అన్నారు. మండలంలోని తాళ్లపాలెంలో హిఫర్ ఇంటర్నేషనల్ నవజీవన్ ఆర్గనైజేషన్ హ్యాట్చింగ్ హొూప్ యాక్సిలేటర్ ఇన్ కామ్ - బ్రిడ్జ్ టు సస్టైన్ బిలిటి ఆధ్వర్యంలో కోడిపిల్లల పంపిణీ చేశారు. రైతులు పెంచుకున్న నాటుకోళ్ళను ఒక రైతు నుండి వేరొక రైతుకి ఇప్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ నరసింహులు మాట్లాడుతూ కోడిపిల్లల పెంపకంతో వాటి గుడ్లు, మాంసం వినియోగించడం ద్వారా మన ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. గిరిజన ప్రాంతంలో కోళ్ళ పెంపకంపై శిక్షణ ఇవ్వడమే కాక మేతను కూడా అందిస్తున్నాన్నట్లు చెప్పారు. రంపచోడవరం పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ షరీఫ్ మాట్లాడుతూ రంపచోడవరం డివిజన్‌లో నాటుకోళ్ళ పెంపకంపై ఇప్పటికే ప్రభుత్యానికి నివేదికలు పంపామన్నారు. హిఫర్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం డైరెక్టర్ డాక్టర్ శ్యామ్ కట్టా (బెన్నీ) మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా 2020 నుండి రంపచోడవరం డివిజన్లో కోళ్ల పెంపకంపై అవగాహన సదస్సులు పెడుతూ శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. అడ్డతీగల, గంగవరం, రంపచోడవరం మండలాల్లో గిరిజన రైతులు, ఎఫ్‌పిఒ రైతులకు కోళ్ల షెడ్‌లు నిర్మించి కోడిపిల్లలు, మేతను కూడా అందించామన్నారు. మారేడుమిల్లి, వై.రామవరం మండలాల్లో అవగాహన చేపడతామన్నారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ ఎడి డాక్టర్ సూర్యనారాయణ, కృషివిజ్ఞాన్ కేంద్రం పందిరిమామిడి సైంటిస్ట్ వీరాంజనేయులు, హిఫర్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ గణేశ్, అజయ్, నజీవన్ సిబ్బంది శ్రీనివాస్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ షరీఫ్, హిఫర్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం డైరెక్టర్ డాక్టర్ శ్యామ్ కట్టా (బెన్నీ) పాల్గొన్నారు.

ఉత్సాహంగా షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

ప్రజాశక్తి-ఎంవిపికాలని: ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా మహిళా సిబ్బంది షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో 31 మంది మహిళా సిబ్బంది పాల్గొన్నారు. విజేతగా డిప్యూటి రిజిస్ట్రార్ మంజుల, రమాదుర్గటీం నిలిచారు. ద్వితీయస్థానంలో ఎన్.సునీత, వై.శివకుమారి, పి.దీపికబృందం, తృతీయస్థానంలో సి.హెచ్ జ్యోతికుమారి, మమత నిలిచారు.



మృతి చెందిన గిరిజనుడు

మన్యంలో కుండ పోత వర్షం

-పిడుగుపాటుకు గిరిజనుడు మృతి

ప్రజాశక్తి-అరకులోయరూరల్: మండలంలోని పరిసర ప్రాంతంలో మంగళవారం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం పడింది. పిడుగుపాటుకు గురై గిరిజనుడు చెందగా, దుక్కెడు ఎద్దు మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం....మండలంలోని మాడగడ పంచాయితీ మంజగూడ గ్రామానికి చెందిన సమర్థి డొంబు (58) ఎప్పటిలాగే పశువులు మోపేందుకు గ్రామ సమీపంలో తీసుకెళ్లాడు. మంగళవారం మధ్యాహ్నం 1గంటల సమయంలో ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. అదే సమయంలో పిడుగు పడడంతో డొంబు అక్కడికక్కడే మృతి చెందాడు. అతనితో పాటు పశువు కూడా మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

డుంబ్రిగుడ: మండలంలో మంగళవారం మధ్యాహ్నం ఎడతెరిపి లేకుండా కుండపోత వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భారీగా ఎండలు కాయడంతో తీవ్రతకు మండల గిరిజనులు ఉక్కిరి బిక్కిరి అయ్యారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సుమారు మూడు గంటల పాటు ఏకధాటిగా పిడుగు శబ్దాలతో కుండ పోత వర్షం కురిసింది. దీంతో వాతావరణం కొంత చల్లబడటంతో మండల వాసులు సేద తీరారు. భారీ వర్షం కారణంగా వీధి కాలువలన్ని వర్షపు నీరుతో నిండిపోయి పూర్తిగా జలమయంగా మారాయి.

ధ్రువపత్రాలు జారీ చేయాలి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: గ్రామ పంచాయతీ కార్యాలయంలోనే జనన, మరణ ధ్రువపత్రాలను మంజూరు చేయాలని సిపిఎం మండల నాయకుడు, గసభ పంచాయితీ మాజీ సర్పంచ్ పి.సురేష్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, రేషన్ కార్డులో పేర్లు నమోదు, తొలగింపు, కొత్త రేషన్ కార్డుల మంజూరు చేయుటకు పలు రకాల ధ్రువపత్రాలు కావాల్సి ఉందన్నారు. రేషన్ కార్డు మంజూరుకు జనన ధ్రువపత్రం, వివాహం చేసుకున్న వారికి వివాహ ధ్రవపత్రం, చనిపోయిన వ్యక్తి పేర్లు తొలగించాలంటే మరణ ధ్రువపత్రం అవసరం ఉంటుందని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో ప్రజలకు సరైన అవగాహన లేకపోవడంతో ఈ ధ్రవ పత్రాలు పొందలేకపోతున్నారన్నారు. రేషన్ కార్డులకు ప్రభుత్వం జూన్ 7వ తేదీ వరకు గడువు ఇవ్వడంతో ప్రజలు సతమతమవుతున్నారనీ చెప్పారు.

ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-పెదబయలు: మండల కేంద్రంలో ఏకలవ్య కళాశాలలో జూనియర్ ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ప్రిన్సిపాల్ పికేశవవరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తులు గురుకులం సెల్, ముంచింగి పుట్టు ఏకలవ్య పాఠశాలలో లభిస్తాయని పేర్కొన్నారు.

పీసా చట్టానికి విరుద్ధంగా ఎన్నికలు



తహశీల్దార్ సూర్యారావుకు వినతిపత్రం అందిస్తున్న నూకరాజు

ప్రజాశక్తి-అడ్డతీగల : అడ్డతీగల మండలం డి.భీమవరం పంచాయతీ డి.భీమవరంలో సోమవారం పీసా గ్రామసభ ఎన్నికలు పీసా చట్టానికి విరుద్ధంగా జరిగాయని 'ఆదివాసీ సంక్షేమ పరిషత్' రంపచోడవరం డివిజన్ అధ్యక్షులు మోడిద నూకరాజు, పీత ప్రసాద్ ఆరోపించారు. ఎన్నికను రద్దు చేయాలని తహశీల్దార్ సూర్యారావుకు వినతిపత్రం అందించారు. పీసా గ్రామసభలో గిరిజనేతరులు కేవలం అభిప్రాయాలూ మాత్రమే చెప్పాలని, తమ ఓటు మాత్రమే ఉపయోగించుకోవాలని, కానీ ఓటింగ్ విషయంలో వారు ఒక అభ్యర్థిని నిలబెట్టి వారికి మాత్రమే ఓటు వెయ్యాలని ఇంటింటికి వెళ్లి ప్రోత్సహించి రహస్య ఓటింగ్ వేయించారాని, ఇది చట్టవ్యతిరేక చర్య అయినప్పటికీ అధికారులు కూడా సహకరించారని ఇందులో గిరిజనేతరుల పెత్తనం ఏంటని వారు ప్రశ్నించారు. పీసా చట్ట ప్రకారం గ్రామసభకు హాజరు అయినవారు చేతులు ఎత్తడం ద్వారా ఎన్నికలు జరగాలని రాజకీయ ప్రమేయంతోనే ఈ ఎన్నికలు జరిగాయని ఉన్నతాధికారులకు ఈ విషయమై పిర్యాదు చేస్తామన్నారు.



పోతుకొండలో నిర్వహించిన పీసా గ్రామసభ

పోతుకొండలో పీసా గ్రామసభ

దేవీపట్నం: మండలంలోని ఇందుకూరుపేట పంచాయితీ పోతుకొండలో ఎంపిడిఒ రత్నకుమారి, సర్పంచ్ కారం కృష్ణబాబు ఆధ్వర్యంలో పీసా గ్రామసభ నిర్వహించారు. ఎన్నికల అధికారి వెంకట్ ఎన్నిక నిర్వహించారు. వైస్ చైర్మన్ కుంజం వెంకన్నదొర, సెక్రటరీగా మడి చిన్నాలమ్మను గ్రామస్తులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు కారం సీతారాముడు, మడకం తమ్మనదొర, జనసేన నాయకులు వీరబాబు మండల ఎఒ, గ్రామసెక్రటరీ, సచివాలయం సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళా హక్కుల సాధనకు పోరాటాలు

ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రమణి

ప్రజాశక్తి - విఆర్.పురం : మహిళా హక్కుల సాధనకు పోరాటాలే మార్గమని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సిహెచ్ రమణి అన్నారు. మండలంలోని సున్నంవారిగూడెంలో జరిగిన ఒక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో హామీలు ఇచ్చి అధికారంలోకి రాగానే నిధులు లేవనే పేరుతో కాలయాపన చేస్తూ పబ్బం గడుపుకుంటుందని విమర్శించారు. తల్లికి వందనం, ఉచిత గ్యాస్, ఉచిత బస్సు ఇలా ఏ పథకం కూడా అమలు కావడం లేదన్నారు. మహిళలందరూ కలిసికట్టుగా ఐద్వా ఆధ్వర్యంలో ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. యుటిఎఫ్ సీనియర్ నాయకులు సున్నం రాజులు మాట్లాడుతూ గ్రామాల్లో మహిళా చైతన్యం పెరగాలన్నారు. కార్యక్రమంలో ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్ కుమార్, ఐద్వా నేతలు సున్నం పార్వతి, ముర్రం రంగమ్మ, వీరమ్మ, సుబ్బమ్మ, రాములమ్మ, తోడం చిన్న బూబమ్మ, సర్పంచులు ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రమణి

ఎంపిటిసిలు, ఎంపిపికి వేతనాలు విడుదల

ప్రజాశక్తి-మారేడుమిల్లి : ఎంపిటిసి సభ్యులకు గౌరవ వేతనం విడుదల చేసి ప్రభుత్వం తీపికబురు తెలిపింది. మారేడుమిల్లి మండలంలో మండల పరిషత్ అధ్యక్షులతో కలిపి ఏడుగురు ఎంపిటిసి సభ్యులకు రూ.2,97,964 గౌరవ వేతనం ప్రభుత్వం విడుదల చేసిందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిటిసి సభ్యులకు నెలకు రూ.3000, ఎంపిపికి రూ 6,000 చొప్పున 12 నెలలకు వేతనం విడుదల చేసినట్టు తెలిపారు. వేతనాలు వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాలకు జమచేసేందుకు చర్యలు చేపట్టామని ఎంపిడిఒ తెలిపారు.

ప్రజా సమస్యలపై చిత్తశుద్ధితో పనిచేయాలి

స్థాయీ సంఘ సమావేశాల్లో జెడ్‌పి ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర



స్థాయీ సంఘ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పరిషత్ ఛైర్మన్ సుభద్ర

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రజా సమస్యలపై అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని జెడ్‌పి ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర ఆదేశించారు. ఆమె అధ్యక్షతన 1 నుంచి 7 స్థాయీ సంఘ సమావేశాలు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి జరిగాయి. సమావేశాలను ఆమె ప్రారంభించారు. గ్రామీణాభివృద్ధి, ప్రజా సంక్షేమ పనులు, ప్రణాళికలు, ఆర్థిక సాయం, వైద్య ఆరోగ్యం తదితర అంశాలపై చర్చ జరిగింది. సమావేశాల్లో భాగంగా వివిధ శాఖల అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను ముందుగా చదివి వినిపించారు. వాటిపై సభ్యులు పలు ప్రశ్నలు వేయగా ఆయా శాఖల అధికారులు బదులిచ్చారు. ఇప్పటి వరకు తీసుకున్న చర్యలు, చేపట్టబోయే చర్యల గురించి వివరించారు. ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్లు పంపిణీ నూరు శాతం జరుగుతోందా ? అని అనంతగిరి సిపిఎం జెడ్‌పిటిసి దీసరి గంగరాజు ప్రశ్నించారు. దీనికి జెడ్‌పి ఛైర్‌పర్సన్ సుభద్ర బదులిస్తూ ప్రతి నెలా 1వ తేదీన 98 శాతం పింఛన్లు అందజేస్తున్నట్టు తెలిపారు. అందుబాటులో లేని మిగిలిన వారికి మరుసటి రోజున పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. అప్పటికీ గ్రామాలలో పింఛన్ల విషయంలో ఏమైనా ఇబ్బంది వస్తే స్థానిక ఎంపిడిఒకు తెలియజేయాలని, వెంటనే తగు చర్యలు తీసుకుంటారని ఆమె తెలిపారు. డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ మాట్లాడుతూ స్థలం ఉన్న రైతులు మొక్కల పెంపకాన్ని ఎంజిఎన్‌ఆర్‌ఎస్ ద్వారా చేపట్టవచ్చని తెలిపారు. గ్రామాలలో మురుగు నీటి సమస్యను నివారించడం కోసం మురుగు కాలువలు చివరి ప్రదేశాలలో ఇంకుడు గోతుల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో మూడు వరకు కమ్యూనిటీ ఇంకుడు గోతుల నిర్మాణం ఈ పథకం నిధుల ద్వారా చేపడతామని చెప్పారు. అరుకు జెడ్‌పిటిసి శెట్టి రోషిని మాట్లాడుతూ గిరిజన గ్రామాలలో ఫాగింగ్ చేపట్టడం లేదని, అందువల్ల మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి వ్యాధులు ప్రబలుతున్నాయని చెప్పారు. 108 అంబులెన్సులు సకాలంలో స్పందించడంలేదని, దీని కారణంగా గిరిజన ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఫిర్యాదు చేశారు. సుభద్ర మాట్లాడుతూ గిరిజన ప్రాంతమైన పాడేరు మండలంలో 108 సౌకర్యం కల్పించడంలో తీవ్ర జాప్యం జరుగుతున్నట్టు తన నోటీసుకు వచ్చిందని తెలిపారు. జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయి కార్యక్రమంపై దృష్టి సారించి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆమె గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులను ఆదేశించారు. అలాగే జల్ జీవన్ మిషన్ ద్వారా పెండింగ్ కనెక్షన్లు, కొన్ని ప్రాంతాల్లోని ఇతర సమస్యలపై మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ లేవనెత్తిన ప్రశ్నలకు బదులిస్తూ, వాటిపై తక్షణ చర్యలు తీసుకోవాలని అన్నారు. సమావేశంలో జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి పి.నారాయణమూర్తి, ఉప ముఖ్య కార్యనిర్వాహణాధికారి కె.రాజ్ కుమార్, మూడు జిల్లాల వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సమస్యలను లేవనెత్తిన గంగరాజు

సిపిఎం అనంతగిరి జెడ్‌పిటిసి దీసరి గంగరాజు జెడ్‌పి రెండో స్థాయీ సంఘాల సమావేశంలో గిరిజన ప్రాంతం ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ప్రస్తావించారు. జెడ్‌పి ఛైర్‌పర్సన్‌కు వినతిపత్రం సమర్పించారు. సమావేశంలో సమస్యలపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా మంజూరు చేసే వృద్ధాప్య పింఛన్లకు సంబంధించి సచివాలయ కేంద్రాల్లో దరఖాస్తులు స్వీకరించాలని కోరారు. నిరుద్యోగ యువతకు బ్యాంకుల నుండి రుణాలు మంజూరు చేయాలన్నారు. వెటర్నరీ డిపార్టుమెంట్ నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ ద్వారా సెంట్రల్ గవర్నమెంట్ అండర్ టేకింగ్‌లో కోట్లాది రూపాయలు మంజూరై ఉపయోగపడకుండా మురిగిపోతున్నాయని తెలిపారు. వందలాది గిరిజన యువత నిరుద్యోగులుగా ఉన్నారన్నారు. బ్యాంకుల అధికారులు అంగీకారం చెప్పని కారణంగా నిరుద్యోగ యువత రుణాలు పొందలేక పోతున్నారన్నారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లి రుణాలు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకం ద్వారా అల్లూరి సీతారామరాజు జిల్లా 11 మండలాల్లో గిరిజన ప్రాంతాల్లో పొలాలు, గరువులు పనులు చేయడమే కాకుండా కాఫీ తోటల్లో బెంచి కట్టింగ్, టెరాసింగ్ పనులు చేపట్టడం, అలాగే మరికొన్ని ప్రాంతాల్లో జీడి మామిడి తోటల పెంపకం కోసం పనులు చేసేందుకు ప్రత్యేక అనుమతులు మంజూరు చేయాలని సభ దృష్టికి తీసుకొచ్చారు. కేటిల్ షెడ్స్ నిర్మించిన లబ్ధిదారులకు బిల్లులు చెల్లించాలని కోరారు. షోక్ ఫిట్స్ అన్ని గ్రామాలలో నిర్మించాలన్నారు. ఎపిడెమిక్ సీజన్ ప్రారంభం కావడంతో దోమల కాటుతో మలేరియా, టైఫాయిడ్, డెంగీలాంటి జబ్బులు వెంటాడుతున్నాయన్నారు. గ్రామాల్లో ఫాగింగ్ చేయాలని కోరారు



స్థాయీ సంఘ సమావేశంలో సమస్యలను లేవనెత్తుతున్న గంగరాజు



మాట్లాడుతున్న కిడారి శ్రావణ్‌కుమార్

త్వరలోనే జిఒ 3 తరహాలో మరో జిఒ

జిసిసి ఛైర్మన్ శ్రావణ్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: నిరుద్యోగ ఆదివాసి యువతకు నూరు శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించి ప్రభుత్వం న్యాయం చేస్తుందని జిసిసి ఛైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ వెల్లడించారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవో నెంబర్ 3 తరహాలనే ప్రత్యామ్నాయ జీవో తీసుకు రావడానికి సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని చెప్పారు. ఆదివాసుల హక్కులు చట్టాలు కాపాడుతు వస్తున్నది తెలుగుదేశం పార్టీయేనని తెలిపారు.డిఎస్‌సి ద్వారా ఉపాధి ఉద్యోగ అవకాశాలు ఇచ్చిన ఘనత తెలుగుదేశం పార్టీదేదని వ్యాఖ్యానించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జీవో .3 రద్దయితే కనీసం జగన్మోహన్ రెడ్డి నోరు మెదపలేదని విమర్శించారు. జీవో .3పై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గిరిజన సంక్షేమ శాఖ అధికారాలతో సమీక్షా నిర్వహించి మరో జీవో తీసుకురావడానికి ప్రయత్నం చేయడంపై ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాకూరు సర్పంచ్ బాకూరు వెంకటరమణ రాజు, దారెలా సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి, గూడ సర్పంచ్ జ్ఞానప్రకాష్, శోభకోట సర్పంచ్ పలసీ శశి భూషణం నాయుడు, హుకుంపేట మండల ప్రధాన కార్యదర్శి సిర్గం సూర్యకాంతం, ముంచంగిపుట్టు మండల ప్రధాన కార్యదర్శి కొంతేరి జాగ్రతాయ్, క్లస్టర్ ఇంచార్జి రూడి త్రినాధ్, యూనిట్ ఇంచార్జి మజ్జి చిన్ని పాల్గొన్నారు.

కిశోర బాలికలపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి.- చింతపల్లి :-కిషోర్ బాలికల్లో లక్ష్యసాధనపై అవగాహన పెంచడం ఎంతో అవసరమని చింతపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిణి జి.వెంకటరమణి అన్నారు. మంగళవారం ఆమె ఐసిడిఎస్ అదనపు ప్రాజెక్ట్ అధికారిణి ఎం.రామలక్ష్మితో కలిసి మండలంలోని కొత్తపాలెం, తాజంగి సచివాలయాల పరిధిలోని కోరుకొండ, బలబద్రం అంగన్వాడి కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లోని రికార్డులను పరిశీలించారు. కిశోర బాలికల భద్రతపై తల్లిదండ్రులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలికలు తల్లిదండ్రుల అనుమతితోనే బంధువుల గ్రామాలు, ఇతర ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. బాలికల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్లు గౌహరున్నీషా, గౌరీ, విజయకుమారి, అప్పల నరసమ్మ కొత్తపాలెం, తాజంగి అంగన్వాడి కార్యకర్తలు, గ్రామస్థులు, బాలికలు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు చర్యలు

- ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి -అనంతగిరి: సమస్యల నడుమ మల్లెపాడు పేరుతో ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు స్తంభాలను మంజూరు చేశారు. ఏప్రిల్ నెల 23వ తేదీన సమస్యల నడుమ మల్లెపాడు కథనంలో కర్రలే విద్యుత్ స్తంభాలు పేరుతో ప్రచురితమైంది.దీంతో, స్థానిక విద్యుత్ శాఖ అధికారులు స్పందించి విద్యుత్తు స్తంభాలు మంజూరు చేశారు. దీంతో గ్రామస్తులు మంగళవారం మెయిన్ రోడ్డు నుండి గ్రామం వరకు కర్రల సాయంతో స్తంభాలను భుజంపై మోసి దట్టమైన అటవీ మార్గం మీదుగా ఆరు కిలోమీటర్ల దూరం తరలించారు.



అటవీ మార్గం గుండా స్తంభాలు తరలిస్తున్న గిరిజనులు

20న సమ్మెను విజయవంతం చేయాలి



అరకులోయలో సమ్మె నోటీస్ అందజేస్తున్న మ్యూజియం కార్మికులు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: ఈనెల 20వ తేదీన దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు చేపట్టే సమ్మెలో భాగంగా ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయ గిరిజన మ్యూజియం, ఐటిడిఏ టూరిజం కార్మికులు, పద్మావతి గార్డెన్, చాపరాయి, కొత్తపల్లి జలపాతం కార్మికులు సమ్మెలో పాల్గొనున్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక మేనేజర్లకు సమ్మె నోటీసు కార్మికులు అందజేశారు.ఈ సందర్భంగా ఐటిడిఏ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు దాడి రాజు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, కార్మికులకు నష్టదాయకమైన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ డిమాండ్ చేశారు. కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని, కనీస వేతనం 26వేలు చెల్లించాలన్నారు. చట్ట ప్రకారం పీఎఫ్,ఈఎస్ఐ వంటి సౌకర్యాలు అందలేదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక చట్టాలపై ఈనెల 20న దేశవ్యాప్తంగా సమ్మె జరుగుతుందని, ఈ సమ్మెలో కార్మికులంతా అన్ని యూనిట్లు మూసివేసి విధులు బహిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వంతల రాజు, జయరాజు, రాంబాబు, రాఘవ పాల్గొన్నారు.

పెదబయలు: సమ్మెను జయంప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు.సిఐటియు మండల కమిటీలో ఆయన మాట్లాడుతూ, నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలన్నారు. కార్మికులకు కనీస వేతనాలు 26,000 అమలు చేయాలని, పెరిగిన ధరలు తగ్గించాలని, నిరుద్యోగ సమస్య పరిష్కారం చేయాలన్నారు. ఈ సమ్మె విజయవంతానికి అన్ని రకాల కార్మికులు ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం రంగ సంస్థలైన స్టీల్ ప్లాంట్, బ్యాంకులు ,ఇన్సూరెన్స్ వంటి సంస్థలను కేంద్రం ప్రైవేటు పరం చేస్తుందని, ఇటువంటి ప్రజా వ్యతిరేక విధానాలను సమర్థవంతంగా ఎదుర్కోవాలని కార్మికులను పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిఐటియు మండల సమన్వయ కమిటీ కన్వీనర్ సిహెచ్ రామారావు, నాయకులు సునీల్ కుమార్, ఐకేపీ నాయకులు వరలక్ష్మి, రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు: ఉపాధి వేతనదారులంతా మే 20వ తేదీన జరిగే సమ్మెకు హాజరై జయప్రదం చేయాలని, సిఐటియు నాయకుడు అప్పలనాయుడు పిలుపునిచ్చారు.ఉపాధి వేతనదారులతో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఉపాధి వేతనదారులకు రోజుకు రూ.600లు చెల్లించాలని, పని ప్రదేశంలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి పనులు యంత్రాలతో చేయించడం తగదని, 200 పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు.



పెదబయలులో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

వీర జవాన్ల కుటుంబాల సంక్షేమ నిధికి విరాళం



కలెక్టర్ హరేంధిరప్రసాద్‌కు విరాళం అందిస్తున్న కోటేశ్వరరావు తదితరులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: సాయుధ దళాల యుద్ధ క్షతగాత్రుల సంక్షేమనిధికి విశాఖ ఆరువేల నియోగి బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూ.లక్షా 6 వేల 871 చెక్కును మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్‌హరేంధిర ప్రసాద్‌కు సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ముళ్లపూడి కోటేశ్వరరావు, అధ్యక్షులు సుంకరణం సూర్యప్రతాప్, కోశాధికారి పిన్నమరాజు సత్యనారాయణ అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ సేవలో త్యాగం చేసిన సైనికులకు కృతజ్ఞతలు తెలిపారు. అటువంటి వారికి దేశప్రజల మద్దతు అవసరం అన్నారు.

ప్రీమియం లెదర్ విభాగంలో నూతన ఆవిష్కరణ

ప్రజాశక్తి-విశాఖకలెక్టరేట్: పాదరక్షల మార్కెట్‌లో వేగంగా అభివృద్ధి చెందుతున్న విభాగాన్ని లక్ష్యంగా చేసుకుంటూ, రేర్ బై రేర్ రాబిట్ తమ మొదటి ఓపెన్ ఫుట్‌వేర్ ప్రీమియం లెదర్ స్లిప్-ఆన్స్ ఫర్మెన్‌ను ప్రారంభించినట్లు ది హౌస్ ఆఫ్ రేర్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ పుల్కిత్‌వర్మ తెలిపారు. నగరంలోని ఒక హోటల్లో మీడియాతో ఆయన మాట్లాడుతూ ది హౌస్ ఆఫ్ రేర్ ఆలోచనాత్మకమైన డిజైన్ అన్నారు. ఇవి నిజమైన లెదర్‌తో తయారు చేయబడి, ప్రత్యేకంగా రూపొందించిన ఎర్గనామిక్ సోల్స్‌తో వస్తాయని తెలిపారు.

సెమీ రింగ్ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయానికి అనుసంధానంగా భోగాపురం-రాంబిల్లి మధ్య 4,6,8 వరుసల ప్రతిపాదిత గ్రీన్‌ఫీల్డ్ యాక్సెస్‌కు విఎంఆర్డిఏ కన్సల్టెంట్ నియమానికి ఆర్‌ఎఫ్‌పి (రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్) ఆహ్వానించడం జరిగిందని ఛైర్‌పర్సన్ ఎంవి ప్రణవ్‌గోపాల్, మెట్రోపాలిటన్ కమిషనర్ విశ్వనాథన్ ఒక ప్రకటనలో తెలిపారు. అచ్యుతాపురం నుండి భోగాపురం బీచ్, రాంబిల్లి సమీప ప్రాంతాల మధ్య రద్దీని తగ్గిస్తూ ప్రయాణ సమయం తగ్గించటం, ఇప్పటికే అభివృద్ధి చేసిన 6 వరసల జాతీయ రహదారికి అనుసంధానించటం, పర్యాటక రంగానికి ఊతమిచ్చి తద్వారా ఆర్థికవృద్ధికి ప్రోత్సాహం కల్పించే దృష్టితో ఈ ప్రాజెక్ట్ రూపొందించబడుతోందన్నారు.

నియోజకవర్గ సమస్యల పరిష్కారమే లక్ష్యం

దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్: దక్షిణ నియోజకవర్గంలో సమస్యలను యుద ్ధప్రాతిపదికన పరిష్కరించడమే తన లక్ష్యం అని ఎమ్మెల్యే వంశీకష్ణ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఎవిఎన్ కళాశాల వద్ద 'జనవాణి' కార్యక్రమాన్ని నిర్వహించారు. 30,36,37, 38 వార్డులకు సంబంధించిన సమస్యలపై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఆయా వార్డుల్లో ప్రధానంగా సిసి కెమెరాల ఏర్పాటు, రోడ్లు, విద్యుత్‌లైట్లు, నూతన రేషన్‌కార్డులు తదితర అంశాలపై ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజలు సమస్యలను నేరుగా తెలుసుకునేందుకే జనవాణి కార్యక్రమాన్ని చేపట్టానన్నారు. కార్యక్రమంలో టిడిపి దక్షిణ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్, జనసేన పాయింట్‌ఆఫ్ కాంటాక్ట్ శివప్రసాద్‌రెడ్డి, తహశీల్దార్, జోనల్ కమిషనర్, ఆయావార్డుల కార్పొరేటర్లు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

జిఒ 862ను రద్దు చేయాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : పుట్టపర్తి సత్యసాయి జయంతిని రాష్ట్ర పండగలా చేయాలనుకోవడం తగదని భారత నాస్తిక సంఘం రాష్ట్రఅధ్యక్షులు టి.శ్రీరామమూర్తి ఒక ప్రకటనలో విమర్శించారు. రాజ్యాంగ అధికరణ 51ఎ(హెచ్) ప్రకారం శాస్త్రీయ విజ్ఞానం పెంపొందించడం ప్రభుత్వ కర్తవ్యం అన్నారు. విజన్ శాస్త్రీయ విజ్ఞానానికి దోహదపడాలన్నారు. పాలనాసంబంధమైన అన్ని విషయాల్లో విజ్ఞతతో ఆలోచిస్తున్న కూటమి ప్రభుత్వం సాయిబాబా శతజయంతి విషయంలో కూడా అదే విజ్ఞతను పాటించాలన్నారు. జిఒ 862ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

విపత్కర పరిస్థితులపై అప్రమత్తత అవసరం

పెదజాలారిపేటలో సివిల్ మాక్ డ్రిల్‌లో రక్షణదళాలు

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్:

విపత్కర పరిస్థితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి క్లిష్ట సమస్యలనైనా ధీటుగా ఎదుర్కొనాలని ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్ రక్షక దళాలు వారు తెలిపారు. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో బుధవారం పెదజాలారిపేట టిడ్కో గృహసముదాయం వద్ద మాక్‌డ్రిల్ నిర్వహించారు. దీనిలో ప్రధానంగా ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలు కీలకంగా వ్యవహరించాయి. టిడ్కో గృహాల్లో పొగబాంబులు పేలగా వాటిని అగ్నిమాపక యంత్రం సాయంతో మంటలను అదుపు చేయడం, క్షతగాత్రులను హుటాహుటిన తాత్కాలిక వైద్యశిబిరానికి తరలించడం, ప్రత్యేక జాగిలాలతో ప్రమాదం జరిగిన ప్రాంతంలో తనిఖీలు చేపట్టడం వంటి విన్యాసాలను పలువురు ఆసక్తిగా తిలకించారు. సాయంత్రం సివిల్ మాక్‌డ్రిల్ నిర్వహించిన అధికారులు, అదే ప్రాంతంలో రాత్రి బ్లాకౌట్ నిర్వహించారు. టిడ్కో గృహసముదాయాలు, సమీపప్రాంతంలో విద్యుత్ నిలిపివేశారు. చీకట్లో ఉంటే ప్రమాదం తప్పుతుందని పేర్కొంటూ రక్షణ దళాలు అవగాహన కల్పించాయి. భీమిలి ఇన్‌చార్జి ఆర్‌డిఒ సుధాసాగర్, జిల్లా అగ్నిమాపకఅధికారి రేణుకయ్య, డివిజనల్ ఫైర్‌అధికారి సింహాచలం, సివిల్ డిఫెన్స్ ఎస్‌డిసి మధుసూదనరావు, ద్వారకా ఎసిపి అన్నెపు నరసింహమూర్తి, జోన్ -3 కమిషనర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న రక్షణదళాలు

డిప్యూటీ మేయర్‌పై ఉత్కంఠ

'కూటమి' నుంచి పెరుగుతున్న ఆశావహులు
చంద్రబాబు వద్దకు పంచాయితీ
అమరావతికి టిడిపి ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు పయనం
మేయర్ టిడిపికి ఉన్నందున డిప్యూటీ మేయర్ తమ పార్టీకి ఇవ్వాలని జనసేన పట్టు
నేడు తేలనున్న అభ్యర్థి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఈ నెల 19న జరగనున్న డిప్యూటీ మేయర్ ఎన్నిక సందర్భంగా గ్రేటర్‌లో రాజకీయ వాతావరణం వేడెక్కింది. డిప్యూటీ మేయర్ ఎన్నిక నిర్వహించడానికి ప్రభుత్వం ఓకే చెప్పింది. దీనికి సంబంధించిన సమావేశ సమాచారం ఈ నెల 15న కార్పొరేటర్లు, ఎక్స్‌అఫీషియో సభ్యులకు జివిఎంసి అధికారులు తెలియజేయనున్నారు. డిప్యూటీ మేయర్‌గా వైసిపికి చెందిన జియ్యాని శ్రీధర్ పదవీ కాలం నాలుగేళ్లు పూర్తికావడంతో కూటమి పక్షాలు ఇటీవలే అవిశ్వాసం ప్రకటించి ఇన్‌ఛార్జి కమిషనర్, విశాఖ జిల్లా కలెక్టర్‌కు నోటీసును ఇచ్చి డిప్యూటీ మేయర్‌కు ఉద్వాసన పలికారు. ఈ నెల 19న డిప్యూటీ మేయర్ ఎన్నిక జరగనున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన ఏర్పాట్లు సాగుతున్నాయి. 97 మంది కార్పొరేటర్లు, 14 మంది ఎక్స్‌అఫీషియో సభ్యులు కలసి ఈ ఎన్నికల్లో పాల్గొంటారు. కొద్ది రోజుల క్రితం వైసిపికి చెందిన నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారిపై కూటమి కార్పొరేటర్లు అవిశ్వాసం ప్రకటించి మేయర్ స్థానం నుంచి దించేసిన సంగతి తెలిసిందే. ఆ స్థానంలో టిడిపి కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావు మేయర్‌గా ఎన్నుకోబడ్డారు. తాజాగా డిప్యూటీ మేయర్ ఎన్నిక జరగనుండడంతో టిడిపి ఎమ్మెల్యేలు మొదటి డిప్యూటీ మేయర్ స్థానాన్ని తమ వారికే కేటాయించాలని పార్టీ అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వద్దకు మంగళవారం రాత్రి అమరావతి ప్రయాణం అయ్యారు. వారి వెంట ముఖ్య నాయకులు, కార్పొరేటర్లు కూడా ఉన్నారు. బుధవారం నాటికి డిప్యూటి మేయర్ అభ్యర్థి ఎవరన్నది స్పష్టంగా తెలియనున్నట్లు సమాచారం.

ఆశావహులు వీరే..

డిప్యూటీ మేయర్‌ను జనసేనకు కేటాయించే అవకాశాలు ఉన్నట్లు తొలుత ప్రచారం సాగింది. కానీ టిడిపి నేతలు తాజాగా డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ కాపు సామాజిక తరగతి కాబట్టి అదే సామాజిక తరగతి నుంచి అవకాశాన్ని టిడిపికే కల్పించాలని పట్టుబడుతున్నారు. మేయర్ స్థానం టిడిపికి ఉన్నందున డిప్యూటీ తమకివ్వాలంటూ జనసేన కార్పొరేటర్లు కొంతమంది కోరుతున్నారు.


ఆ పార్టీకి 14 మంది వరకూ మద్దతు ఉంది. వైసిపి నుంచి జనసేన పార్టీలోకి చేరిన 43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ కాపు సామాజిక తరగతికి చెందిన వారైనందున ఆమెకు అవకాశం కల్పించాలని కోరుతున్నట్లు తెలుస్తోంది. జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ క్రీడాకారిణిగా నగరం నుంచి పేరుతెచ్చుకున్న ఆమె పలు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ భాగస్వామ్యం అవుతూ వస్తుండడంతో ఆమె పేరును జనసేన అధిష్టానం పరిశీలించే అవకాశాలు లేకపోలేదు. జనసేన నుంచి పీతల మూర్తియాదవ్ తనకు అవసరం లేదని లేఖ ద్వారా అధిష్టానానికి తెలిపినట్లు సమాచారం. జనసేన నుంచి దల్లి గోవింద, కందుల నాగరాజు కూడా డిప్యూటీ మేయర్ పదవిని ఆశిస్తున్న వారిలో ఉన్నారు. టిడిపి నుంచి గంధం శ్రీను, సేనాపతి వసంత పదవిని ఆశిస్తున్న వారిలో ఉన్నారు. బిజెపి నుంచి గంకల కవిత కూడా తనకు కేటాయించాలని కోరుతున్నారు. వైసిపి నుంచి జనసేనకు వచ్చిన వారికి డిప్యూటీ మేయర్ కేటాయించాలంటే బి ఫారం ఇచ్చేటప్పుడు సాంకేతికంగా సమస్య తలెత్తుతుందన్న వాదన కూడా లేకపోలేదు.

16వ రోజుకు సిహెచ్‌ఒల సమ్మె

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వైద్య ఆరోగ్య శాఖలో ఎన్‌హెచ్‌ఎం ద్వారా గ్రామీణ ప్రాంత ఆయుష్మాన్‌లో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు (సిహెచ్‌ఒ)కు ఉద్యోగభద్రత కల్పించాలని తలపెట్టిన సమ్మె మంగళవారానికి 16వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. వారికి విశాఖ జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాసరావు మద్దతు ప్రకటించారు. గీత, అరుణ, కల్పన, మణి, పూర్ణిమ, మానస, మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి : సమ్మెలో భాగంగా మంగళవారం స్థానిక నెహ్రూ చౌక్ వద్దగల నిరసన శిబిరంలో రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, నారాలోకేష్, రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి వై సత్యకుమార్ యాదవ్ తదితరులకు సోషల్ మీడియా వేదిక 'ట్విట్టర్' (ఎక్స్) ద్వారా తమ విన్నపాన్ని తెలియజేస్తూ సిహెచ్‌ఒలు క్యాంపెయిన్ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం, మంత్రులు వెంటనే చొరవ తీసుకుని తమ సమస్యల పరిష్కారానికి ముందుకు రావాలని కోరారు. వారికి స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ వివి.శ్రీనివాసరావు మద్దతు తెలియజేశారు. ఆరేళ్లకే పర్మినెంట్, ఉద్యోగభద్రత, సమాన వేతనం, జాబ్‌చార్ట్ తదితర డిమాండ్లను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో భవాని, యమున, రేవతి, నూకాలమ్మ, లక్ష్మి, సంధ్య పాల్గొన్నారు.

200 కిలోల గంజాయి స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఒడిశా నుంచి విశాఖపట్నం మీదుగా తరలుతున్న 200 కిలోల గంజాయిని ఆనందపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసులు పట్టుకున్నారు. నలుగురిని అరెస్టు చేశారు. కేసు వివరాలను మంగళవారం మధ్యాహ్నం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో విశాఖపట్నం లా అండ్ ఆర్డర్ డిసిపి - 1 అజిత వేజెండ్ల వెల్లడించారు. ముందస్తు సమాచారం ప్రకారం ఆనందపురం హైవేలో తనిఖీలు నిర్వహిస్తుండగా బోయపాలెం జంక్షన్ వద్ద ఒడిశా నుంచి విశాఖపట్నం వైపుగా వెళ్తున్న ఒక ద్విచక్ర వాహనాన్ని, ఒక బొలెరో వాహనాన్ని ఆపి తనిఖీ చేశామన్నారు. వారి వద్ద నాలుగు బస్తాలలో 40 బ్రౌన్ కలర్ ప్యాకెట్స్‌ను గుర్తించినట్టు తెలిపారు. అనంతరం వారిని విచారించగా అది గంజాయిగా నిర్ధారణ అయిందన్నారు. ఒడిశాలోని కోరాపుట్‌కు చెందిన రఘు హంటల్, నరేంద్ర పాంగి, బినయ మండల్, రబీంద్ర కిలా తక్కువ సమయంలో సులువుగా డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకొని గంజాయి వ్యాపారం చేస్తున్నట్టు గుర్తించి వారిని అరెస్టు చేశామన్నారు.

ఇచ్ఛాపురానికి రోడ్డు వెయ్యరూ..

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం కుసులవాడ పంచాయతీ గిరిజన గ్రామమైన ఇచ్ఛాపురం గ్రామానికి సరైన రోడ్డు లేక గ్రామస్తులు పలు అవస్థలు పడుతున్నారు. సుమారు 10 ఏళ్ల క్రితం తెలుగుదేశం ప్రభుత్వం ఆధ్వర్యాన బాకురుపాలెం నుంచి ఇచ్ఛాపురం గ్రామానికి రోడ్డు మంజూరు చేశారు. అప్పట్లో రోడ్డు ఏర్పాటుకు మెటల్ వేసి కొంతమేర తారు రోడ్డు ఏర్పాటుచేశారు. బాకురుపాలెం నుంచి సుమారు కిలోమీటర్ మేర ఫారెస్టు భూములు ఉన్నాయని అటవీ అధికారులు అడ్డు చెప్పడంతో తాత్కాలికంగా మెటల్ వేసి వదిలేసారు.

తారు రోడ్డు వెయ్యకపోవడంతో పూర్తిగా శిథిలమైంది. ఇచ్ఛాపురం గ్రామంలో ఎస్‌టి కులానికి చెందిన సుమారు 55 కుటుంబాలు జీవిస్తున్నాయి. వీరు ప్రతిరోజూ గ్రామం నుంచి ఏ అవసరానికి అయినా విజయనగరం, విశాఖపట్నం వెళ్తుంటారు. గర్భిణులు, వృద్ధులు ఈ రోడ్డులో ప్రయాణించేటప్పుడు పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా వర్షాకాలంలో నీరు చేరి చెరువులను తలపించే విధంగా రోడ్డు తయారవుతోంది. వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి వేళల్లో జంతువులు సంచారం, లైట్లు లేకపోవడంతో గ్రామస్తులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణాలు సాగిస్తున్నారు. ఇచ్ఛాపురానికి పూర్తిస్థాయిలో రోడ్డు, లైట్లు ఏర్పాటుచేయాలని ఇచ్ఛాపురం గ్రామస్తులు కోరుతున్నారు.